క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సచివాలయం తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె గ్రామ సచివాలయాన్ని మంగళవారం చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు (వాసు) ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూవ్‌మెంట్, సీఎల్ రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సచివాలయం తనిఖీ అనంతరం మండలంలోని కమ్మినాయునిపల్లెలో రాజుపల్లె ఎంపీటీసీ మునీశ్వరి భర్త క్రిష్టప్పను జెడ్పీ చైర్మన్ పరామర్శించారు. అనారోగ్యానికి గురైన ఆయనతో మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నవమి వేడుకలు



స్వామివారికి మొక్కుతున్న భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట కోదండరామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా పదవ రోజు మంగళవారం అర్చకులు మూలవిరాట్‌లకు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు., బలిజ సంఘం ఉభయదారులుగా వ్యవహరించి తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

కంటి వైద్య శిబిరానికి స్పందన



చౌడేపల్లెలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని, మొత్తం 25 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. జాలప్ప ఆసుపత్రి, దేవరాజ్ అర్స్ కోలార్ మెడికల్ కళాశాల సహకారంతో డాక్టర్ రోహిత్‌రెడ్డి, అర్చలారెడ్డి రోగులకు వైద్య పరీక్షలు చేసి ముగ్గురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అలాగే పది మంది రోగులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు.

కొలిక్కి వస్తున్న వివాహిత అనుమానాస్పద మృతి కేసు



యాస్మిన్ (ఫైల్)

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో పెళ్లయిన రెండు నెలలకే అనుమానాస్పద రీతిలో చనిపోయిన యాస్మిన్‌భాను కేసు కొలిక్కి వస్తోంది. కులమతాలు వేరైన యాస్మిన్, సాయితేజ పెద్దలను ఎదిరించి ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకోవడం.. తండ్రి డిప్రెషన్‌లో ఉన్నాడని మూడు రోజుల క్రితం యాస్మిన్‌ను ఆమె కుటుంబ సభ్యులు చిత్తూరుకు పిలిపించుకున్న అరగంటలో అనుమానాస్పదంగా మృతి చెందడం తెలిసిందే. బాలాజీ కాలనీలోని పుట్టింట్లో యాస్మిన్ ఇంటి పైకప్పునకు చున్నీతో వేలాడుతూ నిర్జీవంగా కనిపించడాన్ని తొలుత ఆమె తల్లి ముంతాజ్ గుర్తించింది. అప్పటికే తండ్రి షౌకత్ అలీ తిట్టడం, యాస్మిన్ చనిపోయిన వెంటనే తండ్రి కనిపించకుండా వెళ్లిపోవడం ఈ ఘటనలో పలు అనుమానాలను రేకెత్తించాయి. దీనికి తోడు పీసీఆర్ కూడలి నుంచి యాస్మిన్‌ను కారులో తీసుకెళ్లిన ఆమె అన్నదమ్ములు, అతని స్నేహితులు ఎవరూ కనిపించలేదు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు యాస్మిన్‌ను తీసుకెళ్లిన కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఇక మృతురాలి తండ్రి షౌకత్ అలీని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేస్తే అసలు విషయం ఏమిటనేది బయటపడనుంది. అలాగే యాస్మిన్‌ను కారులో ఇంటికి తీసుకెళ్లిన వాళ్లను కూడా పోలీసులు తమదైన శైలిలో విచారణ చేస్తున్నారు.

ఇట్లయితే ఇల్లు కట్టినట్టే..!


- అమాంతంగా పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు
- ఈ వారంలో బస్తాపై రూ.50 పెరిగిన సిమెంట్ ధర
- గత ఏడాది కంటే 30శాతం పెరిగిన నిర్మాణ వ్యయం
- అర్ధాంతరంగా నిలిచిపోతున్న ఇంటి నిర్మాణ పనులు



పలమనేరులో ఆగిన ఇళ్ల నిర్మాణాలు







పలమనేరు కురపల్లెకాలనీలో ఆగిన ఇళ్ల నిర్మాణం

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవడమనేది ప్రతి పేదవాడి కల. అప్పులు చేసైనా సరే ఆ కలను సాకారం చేసుకునేందుకు ఇబ్బందులు నడుమ ఇంటిని నిర్మించుకుని తాము పడిన కష్టం అంతా మరిచిపోతారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోవడం సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి శరాఘాతంగా పరిణమించింది. మొన్నటి వరకూ బస్తా రూ.300 ఉన్న సిమెంట్ ఇప్పుడు రూ.360కి చేరింది. అలాగే కమ్మీ, ఇటుకలు, ఇసుక, పునాదిరాళ్ల ధరలు గత ఏడాది పోల్చితే ఇప్పుడు 30శాతానికి పైగా పెరిగాయి. దీనికితోడు కూలీలు, తాపీ మేస్త్రీల కూలీ సైతం భారీగా పెరిగింది. ఫలితంగా పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో కొత్త ఇళ్ళనిర్మాణాలు కొండెక్కాయి. ఇక ప్రభుత్వ పక్కా ఇళ్ల నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసలు ముందుకు సాగడం లేదు.

సిమెంట్ బస్తాపై రూ.50 పెంపు

గత వారంలో బస్తా సిమెంట్ ధర రూ.300గా ఉంది. ఇప్పుడు బస్తాపై రూ.50 పెరిగి రూ.350కి చేరింది. కమ్మీ ధరలు సైతం కిలో రూ.65 దాటాయి. ఫలితంగా ఇళ్ల నిర్మాణదారులకు కష్టాలు తప్పడం లేదు.

ఆగుతున్న ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ళు కట్టుకోవాలనే ఆశతో ముందుగా సగం పనులు చేశాక అసలు బాధలు అర్థమవుతున్నాయి. నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడం, చేసిన అప్పులకు వడ్డీలు కట్టడం తదితరాల కారణంగా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోతున్నాయి. ఫలితంగా సామాన్యునికి సొంతింటి కల..ప్రస్తుతం కలగానే మారుతోంది.

ఇప్పటికే కొండెక్కిన ప్రభుత్వ పక్కా ఇళ్లు

డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో మొత్తం 30వేల ఇళ్లు మంజూరు కాగా వీటిల్లో 17వేల వరకూ పూర్తయ్యాయి. మిగిలిన 23వేల నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. ప్రధానంగా వీటికి బిల్లులు మంజూరు చేయడం లేదు. గతంలో ఇంటికోసం చేసిన అప్పులే కట్టలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పెరిగిన ధరలు మరింత భారమయ్యాయి.

గత ఏడాది ఇప్పటికి గృహ నిర్మాణ సామాగ్రి ధరల పెంపు ఇలా

సామాగ్రి పేరు	2024లో ధర	ప్రస్తుత ధర
సిమెంట్(బస్తా)	రూ.290	రూ.360
స్టీల్(కిలో)	రూ.57	రూ.65
ఇటుకలు ఒక్కటి	రూ.7	రూ.10
ఇసుక(ట్రాక్టర్)	రూ.1500	రూ.2500
పునాదిరాళ్లు(ట్రాక్టర్)	రూ.4వేలు	రూ.6వేలు
కూలీ పురుషులకు రోజుకి	రూ.500	రూ.700
తాపీ మేస్త్రీకి రోజుకి	రూ.800	రూ.1000
2సెంట్ల ఇంటి నిర్మాణానికి	3.20లక్షలు	రూ.4.20లక్షలు

పలమనేరు డివిజన్ జనాభా: **6** లక్షలకు పైగా

ఇప్పటికే ఉన్న నివాసాలు : **1.6** లక్షలు

కొత్తగా కడుతున్న ఇళ్లు : **20** వేలకు పైగా

ఇప్పటికే ఆగిన కాలనీ ఇళ్ల నిర్మాణం: **10** వేల దాకా

ఇలా ఉంటే వ్యాపారం ఎట్టా జరిగేది?



మేము ఈ మధ్యనే సిమెంట్, స్టీల్ షాపు పెట్టాం. ఆరునెలల నుంచి సిమెంట్, కమ్మీ ధరలు పెరుగుతున్నాయేగానీ తగ్గిందంటూ లేదు. ఈ వారంలోనే సిమెంట్ బస్తాపై రూ.50 పెరిగింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఆగి దుకాణాల్లో వ్యాపారాలు పెద్దగా లేవు. మునుపటిలా వ్యాపారం జరగడం లేదు.

–లక్ష్మీనారాయణ రెడ్డి, సిమెంట్ వ్యాపారి, పలమనేరు

నిర్మాణాలు ఆగితే కూలీలకు పనులుండవు



సీపీఎంకు అనుబంధ తాపీకూలీల సంఘాలు ఉన్నాయి. పట్టణంలోనే వెయ్యిమందికి పైగా ఇళ్ల నిర్మాణాలకు వెళ్లే కూలీలున్నారు. ఈ పనులు జరిగితేనే రోజూ కూలీలకు జీవనం గడుస్తుంది. లేదంటే కుటుంబాలకు పూట గడవడం కష్టమే. దీనికంతటికీ కారణం పెరుగుతున్న ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలే. దీనిపై ప్రభుత్వాలు ఆలోచించాల్సి ఉంది.

–గిరిధర్‌గుప్త, సీపీఎం నాయకులు, పలమనేరు

నోటీస్ బోర్డు

● బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీసు క్యాంపు

పలమనేరు: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బుధవారం కస్టమర్ సర్వీసు క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ డీఈ విజయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● 17న 'డయల్ యువర్ డీఎం'

పుంగనూరు: తమ కార్యాలయంలో ఈ నెల 17న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. ప్రజలు ఆర్టీసీ సర్వీసుల పరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు.

ఓఆర్ఎస్ తీసుకోవడం మేలు



గర్భవతులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మల్లీశ్వరి

సదుం: మండుటెండల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ఆరోగ్యానికి మేలని సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం బట్టువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు ఎండల్లో ఎక్కువ తిరగరాదన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి పట్టునే ఉండటం శ్రేయస్కరమన్నారు. గర్భిణులకు పోషకాహారం ప్రయోజనాలు, రక్తహీనత నివారణ, పిండం ఎదుగుదల, అవయవాల ఎదుగుదల, సుఖప్రసవం, వ్యాధి నిరోధక టీకాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ నాగమణి, మండల ఆరోగ్య విద్యాధికారి నీలకంఠం, హెల్త్ సూపర్‌వైజర్ జానకి, ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పలమనేరు: గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరులో స్థానిక అగ్నిమాపక కేంద్ర సిబ్బంది గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు స్థానిక ఫైర్ ఆఫీసర్ మనోగరన్ తెలిపారు. సిబ్బంది ఓ సిలిండర్‌కు నిప్పంటించి దాన్ని సులభంగా ఎలా ఆర్పాలో ప్రదర్శన పూర్వకంగా తెలియజేశారు. అనంతరం గ్రామంలో అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు.

కుప్పంలో..

కుప్పం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం పట్టణంలోని వీధులు, బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వంట గదిలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు రేగితే ఎలా ఆర్పాలి? అలాగే ఆయిల్స్ సంబంధించి అగ్ని ప్రమాదాలు, వాటి అరికట్టడం, అలాంటి ప్రమాదాలు ఎదురైతే సురక్షితంగా ఎలా బయట పడాలో అవగాహన కల్పించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది నరేష్ జయకుమార్, రామమూర్తి, క్రిష్టయ్య, విజయ్, మణి, రఘుపతి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది వారోత్సవాలు నిర్వహించారు. ప్రజలకు అగ్నిప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. వారోత్సవాల పోస్టర్లు, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. వారోత్సవాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది



పుంగనూరు: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు


ఫ్రూట్ కవర్లు కట్టడంపై అవగాహన



మామిడి కాయలకు కవర్లు ఎలాకట్టాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పలమనేరు: మామిడికి ఫ్రూట్ కవర్లను కట్టడంపై మంగళవారం స్థానిక హార్టికల్చర్ అధికారులు మండలంలోని రామాపురంలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి తోటలో కాయలు నిమ్మకాయ సైజులో ఉన్న ఈ తరుణంలో కవర్లను ఎలా కట్టాలో ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. మామిడికి కవర్లకు కట్టడం వలన ఎలాంటి చీడపీడల బెడద లేకుండా కాయ మంచి రంగు, నాణ్యత కలిగి మంచి దిగుబడి వస్తుందని, దీనివల్ల ధర పలుకుతుందని స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన అన్నారు. తమ శాఖ ద్వారా రైతులకు 50శాతం సబ్సిడీతో మామిడి కవర్లను ఇప్పటికే అందజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఏ జాహ్నవి, మామిడి రైతులు సుబ్రమణ్యం నాయుడు, రామచంద్రనాయుడు, జనానాయుడు, బాబు, కల్లాడు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడుబారినా.. మళ్లీ వసంతం..!



గతేడాది డిసెంబరులో కూలిన ఎర్ర చందనం వృక్షం

చిత్తూరు నగరంలోని రిజర్వు ఫారెస్టులో వాకింగ్ వెళ్లే ప్రతి ఒక్కరికీ ఈ ఎర్రచందనం చెట్టు సుపరిచితమే. ఎందుకంటే గతేడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు వాకింగ్‌కు వెళ్లే దారిలో రెండు ఎర్రచందనం చెట్లు నేల కూలాయి. కొన్నాళ్ల తరువాత రోడ్డుకు అడ్డుగా ఉన్న వృక్షాలను అధికారులు కొట్టించేశారు. కానీ ఇందులో ఒక ఎర్రచందనం చెట్టు మాత్రం పూర్తిగా మోడుబారిన చెట్టు, ఇప్పుడు మళ్లీ చిగురించింది. పడ్డచోటే బతికి చూపిస్తోంది. ప్రకృతిలో ఏదైనా సాధ్యమే మరి..!

– చిత్తూరు అర్బన్



ఇప్పుడు అదే చెట్టు చిగురిస్తున్న వైనం

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



కంటేపల్లెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యలు, ఇతర విషయాలలో ఓవరాక్షన్ చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా ఉపేక్షించేది లేదని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కంటేపల్లె, కృష్ణాపురంలో ఎస్ఐ లోకేష్, సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, భూ సమస్యలను సాకుగా చేసుకుని దాడులకు పాల్పడితే కేసులు తప్పవన్నారు. పేకాట, గంజాయి, వ్యభిచారం, కోడిపందేలు లాంటి వాటిపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటికి తాళం బయట ప్రాంతాలకు వెళ్లేవారు లాక్‌డ్ హౌస్ మేనేజ్‌మెంట్‌కు సమాచారం ఇస్తే చోరీలు జరగకుండా నిఘా ఉంచుటామన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

- కనుల పండువగా కల్యాణోత్సవం
- తరలివచ్చిన భక్తులు



బస్టాండులో ఏర్పాటు చేసిన అమ్మవారి కటౌట్



సారె గంపను తీసుకెళ్తున్న కడియాల వంశీయులు

చౌడేపల్లె: చౌడేపల్లెలో నడివీధి గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. రెండ్రోజుల జాతరలో తొలిరోజు గ్రామదేవత చౌడేశ్వరిదేవికి బ్రాహ్మణ మహిళలు పూజాసామగ్రి, అలంకరణ వస్తువులను తీసుకెళ్లి పూజలు చేశారు. కడియాల వంశీయులు సారె గంపను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నాయునివారిపాళ్యంలోని శిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుమ్మరవీధికి చెందిన వెంకటరమణ ఇంట్లో అమ్మవారిని నవ వధువుగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. చాకలివీధిలో మడివిలిరాజుతో మంగళవారం రాత్రి కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించారు. బుధవారం ప్రత్యేక పూజలకు జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గ్రామదేవతలైన చౌడేశ్వరీదేవి, మారెమ్మ, నడివీధి గంగమ్మ, బోయకొండ గంగమ్మ తదితర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. బస్టాండులో అమ్మవారి ప్రతిరూపాలతో విద్యుత్‌త కటౌట్లను ఏర్పాటు చేశారు. నడివీధి గంగమ్మను నెలకొల్పిన ప్రాంతం నుంచి బస్టాండు వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతర సందర్భంగా చౌడేపల్లె సందడి..సందడిగా మారింది. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ రాంభూపాల్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.